మద్దా సురేష్

S 12

(ఎనిమిదవ భాగము)

"అవును. విష మేఘం పరిమాణం క్రమ క్రమంగా పెరుగు తున్న సంగతి ప్రభుత్వం గ్రహించింది. ఏరో కెమికల్ - విమానాల ద్వారా ఆ విష మేఘం మీద స్ప్రే చేస్తున్నారు, మేఘాన్ని విడగొట్టడం కోసం. కాని యెంతవరకూ ఫలితం సాధించారో తెలియదు. కొన్ని ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు ముందు జాగ్రత్తగా. మెటీరియాలజీ ఆఫీస్ నిర్విరామంగా పని చేస్తోంది, గాలి మార్పులు గురించీ—"

"పబ్లిక్ రియాక్షన్ ఎలా ఉంది?"

"దారుణంగా వుంది. కొద్ది నెలల క్రితం స్కైలాబ్ గోడవ! యిప్పుడు....యిది!....భయాందోళనలు....తిట్లు ....శాపనార్థాలు.... పేపర్ వాళ్ళు ప్రభుత్వాన్ని ఫుట్ బాల్ ఆడుతున్నారు."

"ఈ ఉదయం జరిగిన ఎయిర్ క్రాష్—ఎంతమంది మర ణించారందులో?"

"నిర్ధారణగా యింకా తెలీదు. సుమారు 6ు0 మంది మరణించినట్లు అంచనా. 280 మంది విమానంలోనే వున్నారు. ఇంకా కార్పొరేషన్ టవర్ వుద్యోగులు, దాని చుట్టుప్రక్కల వున్న కార్యాలయాల వుద్యోగులు ....కరెక్టుగా యెంతమంది ప్రాణం కోల్పోయారో దేవు డికే తెలియాలి."

హాస్పిటల్ వార్డులా వున్న ఆ గదిలో వాతావరణం అకస్మాత్తుగా వేడెక్కింది....

కాస్సేపు యిద్దరూ యెవరి ఆలోచనలో వారు మునిగి పోయారు, జరిగిన దుర్ఘటనల తాలూకు ప్రాధాన్యత అంచనా వేస్తూ.

ఇద్దరికీ జరిగిందంతా, అసహజంగా, నమ్మశక్యం కానిదిగా, పీడకలలా అగుపిస్తోంది....

"ఇప్పుడు ప్రజలందరికీ విష మేఘం గురించి తెల్సిందా?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ పలికింది రాణా కంఠం.

"తెల్సింది. రహస్యంగా ఉంచదగ్గ వస్తువు కాదది. మైలు పొడవు.... మైలు వెడల్పు...."

"విష మేఘం ఉందని నమ్మేవాళ్ళ రియాక్షన్"

"జనరల్ హిస్టీరియా...."

అదే సమయంలో తలుపు తెర్చుకుని జులేఖా లోనికి వచ్చింది.

"హల్లో రాణా! హౌ ఆర్ యూ ఫీలింగ్?" ఆమె నవ్వులో ఈసారి అలసట కనబడింది.

"అయామ్ ఫైన్! లూసీ కండిషన్ చెప్పండి."

"ఆమె పరిస్థితి అంత బాగులేదు రాణా! హానెస్టుగా చెబుతున్నాను. ఇక్కడ ఈ రోజు చాలా అస్థిర వాతావరణం నెలకొంది" ఆమె రాణా బెడ్ మీద వారగా కూర్చుంటూ అంది. "బట్, లూసీ కోలుకుంటుందనే నా విశ్వాసం...."

అతను తలెత్తి ఆమెవైపు చూశాడు ఆశాజనకంగా.

...."చాలా విషయాలు మాకు రూఢిగా తెల్సాయి. దేశాంలోని మేధావులందరూ యిక్కడ పని చేస్తున్నారు. శవాలమీద జరిపిన అటాప్సీలు చాలా సమాధానాలు చెప్పాయి రాణా! కాని 'అసలు కారణం' తెల్సుకోనిదే మాకు ఏ విషయం నిర్ధారణ కాదు. ఇందాక 'అస్థిర వాతావరణం' అని అందుకే అన్నాను."

"దయచేసి విషయాన్ని సూటిగా చెప్పండి— జులేఖా!"

గాఢంగా నిట్టూర్చి చెప్పసాగింది జులేఖా. "డిఫెన్స్ మినిస్ట్రీ తాలూకు, కెమికల్ అండ్ మైక్రో బయోలాజికల్ రిసెర్చి సైంటిస్టులు మా వద్ద ఏవో విషయాలు దాస్తున్నట్టు భావిస్తున్నాం. యు సీ, వారి పరిశోధనలలో 'ఒక జవాబు'కోసం ప్రయత్నిస్తున్నట్లు లేదు. ఒక జవాబుని 'నిర్ధారించుకోడం' కోసం ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోంది."

"వారు చేస్తున్న దేమిటో, వారికి నిర్ధారణగా తెలుసు. అందుకే మేం వార్ని మధ్యలో అడ్డుకోలేదు. వారి పరీక్షలు పూర్తయిం తర్వాత కల్సుకున్నాం. కాని ఒక్క విషయం కూడా బైట పెట్టలేదు. వాళ్ళ మినిస్టర్‌ని కల్సుకొనేదాకా ఏ విషయం మాట్లాడకూడదని చెబుతున్నారు. వారు కనుక్కున్న నిజాన్ని లేదా నిర్ధారణ చేసుకొన్న అనుమానాన్ని అప్పటి దాకా చెప్పలేరట.

"బాస్టర్డ్స్....యిన్ని లక్షలమంది ప్రజలు చచ్చిపోతున్నా వాళ్ళు అసలు విషయాన్ని దాస్తున్నారు!" ఉద్రేకంగా పైకి లేచాడు రాణా, ఎర్రబడ్డ ముఖంతో "రైనా!—గెట్ మీ ప్రొఫెసర్ సన్యాల్! ఆయన సమాధానాలు కనుక్కుంటారు. ఆయన కూడా విఫలమైతే—ఈ విషయాన్ని నేను పేపర్ల నిండా హెడ్‌లైన్స్ పబ్లిసిటీ చేయిస్తాను. ఐ డోంట్ గివ్ ఎ డామ్ ఇఫ్ ఐ లూస్ మై జాబ్!"

"ఆయన్ని కాంటాక్ట్ చేస్తాను రాణా! కాని నువ్వు వ్యక్తిగతంగా చేయగలిగేదేమీ ఉండదు. ప్రభుత్వ రహస్యాలకు సంబంధించిన విషయమిది. నిన్ను అజ్ఞాతంగా

లాకప్‌లో పడేస్తారు" అన్నాడు రైనా, రియలిస్టిక్‌గా.

"జస్టు గెట్ హిమ్! యుయ్ విల్ సీ!" అన్నాడు రాణా కోపాన్ని అణుచుకుంటూ.

"ఓ.కే, ఓ..కే., బట్ కీప్ కామ్."

"ఎస్ రాణా!" నొక్కి పలికింది జులేఖా. "ఉద్రేక పడ్డంవల్ల ప్రయోజనంలేదు. అది యెవరికీ సహాయపడలేదు. మీరు యిప్పుడు చేయవల్సింది—ఆహారం తీసుకోడం. మీ మీమీద జరిపిన పరీక్షల ఫలితాలు కొంతసేపటికి తెలుస్తాయి. నా లెట్ మీ ఆర్డర్ సమ్ ఫుడ్ వైల్ ఇన్‌స్పెక్టర్ రైనా గెట్స్ ఇన్ టచ్ విత్ ప్రొఫెసర్ సన్యాల్! తర్వాత మీమీద జరిపిన పరిశోధనా ఫలితాలు పూర్తిగా చెప్తాను....నా రిలాక్స్!"....

* * *

మూడు గంటల తర్వాత....

రెండవ ఎమర్జన్సీ సమావేశం ఛత్రపతి భవన్‌లో ఏర్పాటు చేయబడింది.

ఈసారి కాన్ఫరెన్స్‌లో రక్షణశాఖ అధికారులు ఎక్కువగా హాజరయ్యారు.

మహారాణా—తన పైఅధికారి ప్రొఫెసర్ సన్యాల్-జులేఖాల మధ్య కూర్చున్నాడు.

తన ఉద్యోగి రాణా—సందేశాన్నందుకొని, డిపార్టు మెంట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, డైరెక్టర్ సన్యాల్, చాలా భీభత్సం చేశాడు.

తత్ఫలితంగా మొదటి సమావేశంలో హాజరైన అధికారులు బొంబాయిలోనే ఉండటంచేతా, రెండవ సమావేశం యేర్పాటుకు వెంటనే నిర్ణయం జరిగింది. ఢిల్లీనుండి మరి కొందరు అధికార్లు మిలటరీ హెలికాప్టర్‌లో రప్పించ

బడ్డారు.

పరిస్థితి ఉద్రిక్తమవడం చేత, డిఫెన్స్ మినిస్ట్రీ ఈ సారి నిజాయితీగా, ముక్కుసూటిగా సమాధానాలు యివ్వడానికి అంగీకరించింది. హోమ్ సెక్రటరీ పట్టుదల వల్ల కేంద్రమంత్రి ఆ మేరకు తన శాఖకు ఆర్డర్స్ జారీ చేసాడు.

ఓక్ చెక్కతో చెయ్యబడ్డ ఆ విశాలమైన రౌండ్ టేబుల్ చుట్టూ ఆసీనులై తమతమ ప్రక్కవారితో గుస గుస లాడుతున్న అధికార్ల ముఖాలు పరిశీలించాడు, రాణా.

అతను అక్కడికి రాగానే, చాలామంది అతనికి పరిచయం చేయబడ్డారు.

సమావేశం ప్రారంభం కావడానికి యెదురుచూస్తూ రాణా, ఆ అధికారుల్లో ఒక్కొక్కరి పేరు, హోదాలు గుర్తుతెచ్చుకోడానికి మరోసారి ప్రయత్నించాడు.

కేంద్ర హోం కార్యదర్శి, బల్వంత్ మిత్రా తన సహజ గంభీర ముద్రతో, యెదురుగా ఉన్న కాగితాలు పరిశీలిస్తున్నాడు....

రక్షణశాఖ స్టేట్ మినిస్టర్ గోకుల్ రామ్, ఆయన ప్రైవేట్ సెక్రెటరీతో కల్సి—ఆర్మీ అండర్ సెక్రటరీ రణధావేతో వ్యక్తిగత సమాలోచనలు సాగిస్తున్నాడు....

చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్—జనరల్ చావ్లా, వైస్—చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్—లెఫ్టినెంట్ జనరల్ ప్రచండసేన్ కలిసి గుసగుసలాడుకుంటున్నారు....

కాన్ఫరెన్స్ టేబుల్—దూరంగా మరో యిద్దరు కూర్చొని ఉన్నారు. వారి ఉనికికి కారణమేమిటో అర్థం కాలేదు రాణాకి. కాని, వారిద్దరూ మిలటరీ యూని

ఫాంస్‌లో వున్నారు.

హోమ్ సెక్రటరీ చిన్నగా దగ్గుతూ, టేబుల్ మీద పెన్‌తో టకటక చప్పుడు చేసాడు, సమావేశ ప్రారంభానికి సూచనగా.

"జంటిల్మెన్!" ప్రారంభించాడు బల్వంత్ మిత్రా, "అండ్ లేడీ!" చిన్నగా నవ్వాడు జులేఖావైపు చూసి. "ఈ సమావేశం విషమేఘం యెలా "పుట్టిందీ", దాని ప్రభావం నుండి ప్రజల్ని యెలా "రక్షించవొచ్చు" అన్న విషయాలు చర్చించడంకోసమని మీకు తెలుసు. అయామ్ అండర్ కాన్‌స్టంట్ టచ్ విత్ అవర్ ప్రైమ్ మినిస్టర్. ఈ నిముషంలో, ఆయన ఇండియాకు తిరుగుప్రయాణంలో ఉన్నారని మీకు విన్నవించుకుంటున్నాను. ఇలాంటి విపత్కర పరిస్థితిలో మన మధ్య లేకపోయినందుకు ప్రధాని యెంతో బాధపడ్డారు. జరిగిన సంఘటనలపట్ల తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఆయన లేకపోయినంతమాత్రాన మనం ఎమర్జన్సీగా తీసుకున్న నిర్ణయాలు అమలుజరుపబడకూడదని ఆయన ఉద్దేశం కాదు. వెనువెంటనే తగు చర్యలు తీసుకోమని పూర్తి అధికారాలు యిస్తూ నాకు సందేశం పంపారు.

"ప్రధాని తన రష్యా పర్యటన అర్ధాంతరంగా ముగించుకొని మధ్యలో తిరిగిరావడం విచారించవల్సిన విషయమే. కాని దేశప్రజల రక్షణ ముఖ్యావసరం కాబట్టి తప్పదు. ప్రధాని—ఈ సాయంకాలం సమావేశంలో పూర్తి యాక్షన్‌ప్లాన్ మనం రూపొందిస్తే తను మాతృభూమిలో అడుగుపెట్టగానే ఆమోదముద్ర వేస్తాననీ, ప్లాన్ ఆచరణలో ఆలస్యం కాకుండా ఈ విధంగా చేయమనీ ఆయన నన్ను కోరారు.

"ప్రధాని ముఖ్య ఆదేశం ప్రకారం, ప్రజల క్షేమం కోసం యే మంత్రిత్వశాఖ అయినాగానీ ఈ రోజు, ఈ రాత్రి యిక్కడి సమావేశంలో ఎలాంటి వివరాలు నొక్కి పెట్టకూడదు. నేను ఈ రోజు రక్షణశాఖ సహాయ మంత్రి, ఆర్మీ అండర్ సెక్రటరీలతో వ్యక్తిగత సంభాషణలు జరిపాను.

"తత్ఫలితంగా వెలుబడ్డ కొన్ని నిజాలు ప్రధాన మంత్రికి నివేదించాను. ఆయన మరోసారి స్పష్టంచేసారు మనలో మనం యెట్టి అనుమానాలకు తావు లేకుండా, ఏ విషయం దాచిపెట్టకుండా, ఐకమత్యంతో కృషి చేయాలని. ఈ రాత్రి సమావేశం పరస్పర నిందారోపణలతో, ఒకర్నొకరు విమర్శించుకుంటూ గడపడాన్కి నిర్దేశించ బడలేదని మీరందరూ గ్రహించి సహకరించాలి.

"సో, మనం యిక్కడ "పరిష్కారం" కనుక్కోవడాన్కి సమావేశమయ్యాం. లక్షలాది పౌరుల రక్షణ బయట జూదంలో ఒడ్డబడింది. మనమంతా ఐకమత్యంతో ఈ విష మేఘం మహావిపత్తును యుద్ధ ప్రాతిపదికపై ఎదుర్కొందాం."

తన ఉపన్యాసం శ్రోతల్లో ఎఫెక్ట్ పుంజుకోడాన్కి అవకాశమిస్తూ ఒక్కక్షణం ఆగాడు హోం సెక్రటరీ.

తర్వాత రక్షణశాఖ సహాయమంత్రివైపు తిరిగాడు. "గోకుల్ రామ్‌జీ! మీరు యింతకుముందు వెల్లడించిన వివరాలు వెల్లడి చేయగలరా?"

గోకుల్ రామ్ ముందుకు వంగాడు, తన మోచేతులు టేబుల్ మీద ఆన్చి, ముఖం ముందుగా రెండు చేతులు కలిపి పట్టుకుంటూ.

"జంటిల్మెన్! రక్షణశాఖ యీ విషయంలో పౌర

బోటు....."

"ఈ రోజు యిక్కడ మనం కల్సుకొన్నది ఒకరిని నిందించుకోడానికి కాదు గోకుల్ రామ్‌జీ, వివరాలు చెప్పండం తే...." అసహనంగా పలికాడు హోం సెక్రెటరీ.

"అచ్ఛా!" తేలిగ్గా ఊపిరి వదిలాడు గోకుల్ రామ్. అతని ముఖంలో అపరాధ భావన యిప్పుడు మాయ మైంది. "కథ మొదట్నుంచీ ప్రారంభించాలంటే మనం పదిసంవత్సరాల వెనక్కి వెళ్ళాలి. షేరా మైదాన్‌లో మన మైక్రో బయోలాజికల్ (సూక్ష్మాంగజీవుల-జీవ శాస్త్రం) రీసెర్చి ఎస్టాబిష్‌మెంట్స్ దగ్గరకి. అక్కడ ఒకనాడు పని చేసిన అపూర్వ మేధావి, సైంటిస్టు విశ్వా మిత్ర విషయం దగ్గరకి.

"బాక్టీరియలాజికల్ వార్‌ఫేర్ అంటే "సూక్ష్మ క్రిముల సహాయంతో శత్రువులను నాశనం చేయడం". అంటే సూక్ష్మక్రిములను ఆయుధాలుగా ఉపయోగించడం అన్నమాట. ఈ రంగంలో చైనా దారుణమైన పరిశోధ నలు చేసి, ఎన్నో ఫలితాలను సాధించింది. ఈ విషయం ఇండియాకు గాభరా కల్గించింది. ఫలితంగా మనం కూడా ఈ రంగంలో పరిశోధనలు చేయక తప్పలేదు. ఈ శాఖలో విశ్వామిత్ర ఆరితేరిన విజ్ఞాని."

రాణా వెన్నెముక జలదరించింది.

తను మొదట్నించీ ఊహిస్తున్నది పచ్చి నిజం!

ఈ మూర్ఖుల పిచ్చి ప్రయోగాలే ఈ మారణహోమా నికి పూర్తికారణం।

"ప్రొఫెసర్ విశ్వామిత్ర జీవశాస్త్రంలో చాల విధా లుగా మేధాసంపత్తి గలవాడు. ఆయన మనిషి లేదా

జంతువు శరీరంలో విపరీతమయిన మార్పులు తీసుకువచ్చే ఒక ప్రక్రియను కనిపెట్టాడు. దీనిని 'ఆర్గానిజం' అంటారు."

"అంతకంటే స్పష్టంగా చెప్పాలి" ఓ కంఠం పలికింది గోకుల్ రామ్ మాటలకు అడ్డుతగులూ.

అందరి కళ్ళు ఛీఫ్ సైంటిఫిక్ ఎడ్వైజర్ అశ్వత్థామ వైపు తిరిగాయి.

"ఎస్, ప్రొఫెసర్ అశ్వత్థామా?" అడిగాడు హోమ్ సెక్రెటరీ.

"సైంటిస్టు విశ్వామిత్ర ఆ ప్రక్రియను కొత్తగా కనుగొనలేదు. 'ఆర్గానిజం' అనేది సహజంగా వున్నదే. అయితే తీవ్రమయిన పరిశోధనలు చేసి విశ్వామిత్ర 'మైక్రోప్లాస్మా' అనబడే ఒక ఆర్గానిజాన్ని ఎన్నుకొని దాన్లో తీవ్రమైన మార్పులు తీసుకువచ్చాడు. 'మైక్రోప్లాస్మా' అంటే ఒక జంతువులోగానీ, మనిషిలోగానీ వ్యాధి నుత్పత్తిచేసే ఒక జీవపదార్థం."అంటూ ఆగాడు అశ్వత్థామ.

"ఈ విషయం గురించి మీరే కొనసాగిస్తే మంచిది అశ్వత్థామగారూ! శాస్త్రీయంగా నా కంటే మీరు బాగా చెప్పగలుగుతారు" అన్నాడు రక్షణశాఖ సహాయ మంత్రి.

"ఆల్ రైట్!" తలపంకించి ఆహూతులందర్నీ ఒకసారి పరికించి చూసాడు అశ్వత్థామ. "విశ్వామిత్ర మహామేధావి అనడంలో యెట్టి సందేహం లేదు. కొన్ని సంవత్సరాలు ఆయనవద్ద నేను పనిచేశాను కూడా. కాని విశ్వామిత్ర బాధ్యతారహితమయిన వ్యక్తి అని చెప్పక తప్పదు.

"రక్తప్రసరణలో కలిస్తే ఆరోగ్యవంతమయిన జీవ కణాల్ని పాడుచేసి, మెదడుకు ప్రయాణించే పరాన్నజీవి (పారసైట్)గా మార్పులు చేసాడు మైకోప్లాస్మాని.

ఈ 'అతిసూక్ష్మప్రక్రియ' (మైక్రో ఆర్గానిజం) మెదడులో పదార్థాన్ని వాపుకి గురిచేస్తుంది. దానిపై ఒక పొర లాంటిదాన్ని ఏర్పరుస్తుంది.

దీనివల్ల మెదడులో వున్న జీవకణాలు నిర్వీర్యమై పోయి వాటి స్థానంలో పరాన్నజీవకణాలు (పారసైటికల్ సెల్స్) ఉత్పత్తి చేయబడ్తాయి.

ఈ పారసైట్స్ బలం పుంజుకొనే కొద్దీ క్రమ క్రమంగా ఆరోగ్య జీవకణాలన్నీ వాటిచే మ్రింగివేయ బడతాయ్."

"అప్పుడు యీ వ్యాధి సోకిన మనిషిలో ఉన్మాదం బయలుదేరుతుంది! మెదడులో ఈ పరభుక్త జీవుల ప్రాబల్యం పెరిగేకొద్దీ మనిషి మానసికతుల్య స్థితిని కోల్పోతాడు. భౌతికంగా యే లోపమూ కనబడక పోయినా, క్రమంగా జీవచ్ఛవంలా మారతాడు."

"నే నెందుకు అలా మారలేదు?" ఆశ్చర్యంగా అడిగాడు రాణా ఉండబట్టలేక.

చిరునవ్వుతో రాణా వైపు చూసాడు అశ్వత్థామ. "నువ్వు చాలా అదృష్టవంతుడివి మిస్టర్ రాణా!" అంటూ తలతిప్పి దృష్టి జులేఖామీద కేంద్రీకరిస్తూ "నువ్వు ఎలా రక్షింపబడ్డావో జులేఖా యిప్పుడు చెప్పగలదని భావిస్తున్నాను. కాని చెప్పవలసింది యింకా వుంటుంది" అన్నాడు.

జులేఖా చెప్పింది. "భూకంప సంఘటనలో రాణాకు పెద్ద గాయం యేర్పడింది. అందువల్ల కాంబే మిషనరీ

హాస్పిటల్ లో అతనికి రక్తశుద్ధ చికిత్స జరిగింది. దీనివల్ల అతని రక్తనాళాల్లోని విదేశీకణాలు తొలిగించబడ్డాయి."

"స్పష్టంగా అదే మిస్ జులేఖా!" ప్రొఫెసర్ అశ్వత్థామ తల వూపాడు. "పరిశుద్ధమైన కొత్తరక్తం ఎక్కించడంవల్ల ఆరోగ్యంగా వున్న జీవకణాలు — పరాన్నజీవుల్ని (పారసైట్స్)ని నాశనం చేసాయి, బలహీనంగా ఉన్న సైనికదళాలకు తోడుగా కొత్తదళాలు పంపినట్లు యీ ఫలితం వచ్చింది. రాణాకు అదృష్టవశాత్తూ పరాన్నజీవకణాలు ఉధృతం కాకముందే ఈ రక్తచికిత్స చేయబడింది. మరో విషయంలో కూడా రాణా అదృష్టవంతుడు.

"జెర్మ్ వార్ ఫేర్ లో చాలా ప్రక్రియల్లాగా సైంటిస్టు విశ్వామిత్ర ప్రక్రియలో కూడా ప్రమాదకరమైన యీ పారసైట్స్ వాటి కవే ఉత్పత్తిని చేసుకోగలవు. ఈ పరాన్నజీవులు శరవేగంగా సంతానోత్పత్తి చేసుకోడానికి కావల్సింది కార్బన్-డై-ఆక్సైడ్ మాత్రమే. మనం పీల్చే గాలిలో వుండే యీ కార్బన్-డై-ఆక్సైడ్ వాటికి అమృతం లాంటిది. దాని సహాయంతో యీ పారసైట్స్ అయిదు-పది-పదియిరవై-యిరవై నలభై....యీ రేషియోలో ఉత్పత్తి అవుతాయి. ఈ ప్రక్రియ మొదటి దశలో వుండగా రాణా దానికి ఎక్స్ పోజ్ అయ్యాడు. అందుచేత అవి అప్పటికింకా బలహీనంగా ఉన్నాయ్.

"ఈ సంవిధానం—మీరు చెప్పే ఆవిరి, పొగమంచు లేక మేఘానికి అనుబంధ ఉత్పత్తి. ఆ సంవిధానం కొనసాగుతుండగా గాలిలో వున్న కార్బన్-డై-ఆక్సైడ్ ని అది పీల్చుకుంటూ బలం పుంజుకుంటూ వుంటుంది. ఈ అర్గానిజానికి ఫొటోసింథసిస్ లక్షణం కూడా

వుంది. అంటే యిది జీవిస్తూ రెట్టింపు అవుతుండడానికి సూర్యరశ్మి అవసరం! సూర్యరశ్మిలో దానికి కదిలివెళ్ళే లక్షణం కూడా వుంది.

"వ్యాధి నుత్పత్తిచేసే యీ జీవపదార్థానికి (మైకో ప్లాస్మా) కణకవచం వుండదు. అందుచేత తనకు సరిపడని వాతావరణంలో ప్రవేశించినపుడు యీ పారసైట్స్ తమను తాము రక్షించుకొనడానికి గుంపులు గుంపులుగా నివశిస్తాయి, లోపలి భాగంలో వున్న మైకోప్లాస్మాను కాపాడుతూ. సూర్యరశ్మిలో మాత్రమే యివి క్షేమంగా వుండగలవు. ఇందులో ఒక తిరకాసు ఉంది. ఇవి బ్రతుకుతూ బలం పుంజుకోడానికి సూర్యరశ్మి కావాలి. కానీ యే పరిస్థితులోనైనా యివి పొగమంచులాంటిదాన్ని చుట్టూ కప్పుకొని రక్షించుకోగలవు. ఈ రహస్యాన్ని యింకా వివరంగా చెప్పాలంటే సైంటిస్టు విశ్వామిత్ర మాత్రమే చెప్పగలడు. కాని దురదృష్టవశాత్తూ అతను మరణించాడు.

"నేను యింతకు ముందు చెప్పినట్లుగా విశ్వామిత్ర బాధ్యత తెలీని మనిషి. ఇటువంటి ప్రమాదకరమైన ప్రయోగం తలపెట్టడమే బాధ్యతలేనితనంగా నేను మొదట గుర్తించాను. కాని అతను చేసిన అవివేకపు పనులు యింకా ఉన్నాయ్. తన అశ్రద్ధవల్ల అతను పరిశోధిస్తున్న మైకోప్లాస్మా (వ్యాధిని పుట్టించే జీవ పదార్థం)కే బహిరంగంగా ఎక్స్‌పోజ్ అయ్యాడు. తత్ఫలితంగా పిచ్చివాడయ్యాడు. అతను ఉన్మాదస్థితిలో తన కాగితాలనీ, నోట్సులనీ, సంవత్సరాలపాటు చేసిన కృషిని నాశనం చేసాడు. 'మార్పులు చేసిన మైకో ప్లాస్మా' రహస్యాలనే కాదు యితర పరిశోధనాంశాలనీ,

మానవాళికి యెంతగానో ఉపయోగపడే తదితర పరిశోధ నల డాక్యుమెంట్లనీ కూడా నాశనం చేసుకున్నాడు.

"అతను పిచ్చివాడుగా.... మరణించాడు. తన సృష్టికి తనే బలి అయిపోయాడు. తనతోపాటు అనేక రహ స్యాలు తీసుకుపోయాడు.

"జెర్మ్‌వార్ ఫేర్‌లో యితర ప్రయోగాల్లాగే యీ ప్రయోగం కూడా ఆచరణలో బహు ప్రమాదకరమైంది. ఇక యీ మైక్రోప్లాస్మా తర్వాతి కథను లెఫ్ట్‌నెంట్ జనరల్ ప్రచండసేన వివరిస్తే బావుంటుంది" అంటూ ఆగాడు అశ్వత్థామ వైస్ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ వైపు కనుబొమ లెగరేసి చూస్తూ.

"ఉయ్ కెన్ హార్డ్లీ వెయిట్ టు హియర్" అన్నాడు సన్యాల్ యెత్తిపొడుపుగా.

"ప్రొఫెసర్ సన్యాల్!" హెచ్చరికగా పలికాడు హోమ్ సెక్రెటరీ.

"ఎక్స్‌క్యూజ్ మీ!" ఆరాటంతో జులేఖా కలగజేసు కుంది. "శ్రీ ప్రచండసేన్ మాట్లాడబోయే ముందు అశ్వత్థామగార్ని నేను ఓ ప్రశ్న అడగవొచ్చా? యిఫ్ యు ప్లీజ్! 'వ్యాధి నివారణ' గురించి.... ప్రస్తుతం ఇది చాల ముఖ్య విషయంగా నేను భావిస్తున్నాను."

హోమ్ సెక్రెటరీ తల వూపి అన్నాడు "శ్యూర్ ఆన్!"

"అయితే బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ చికిత్స వ్యాధి నివా రణ మార్గంగా మీరు భావిస్తున్నారు. ఈజ్ దట్ రైట్ ప్రొఫెసర్?" అశ్వత్థామను అడిగింది.

"అవును" నొక్కి పలికాడు అశ్వత్థామ. "సరియైన టైంలో యివ్వగల్గితే. పారసైట్ కణాలు మెదడులో

బలమైన హోల్డ్‌ని సంపాదించిన తర్వాత కొత్త రకం ఎక్కించినా ఉపయోగం వుండదు. ఈ పరాన్న జీవ కణాలు అభివృద్ధి చెందే అవకాశం యివ్వబడలేదు రాణా కేసులో. అందుకే బలంగా పనిచేస్తున్న మెదడులోని జీవకణాలు వాటిని శక్తిహీనం చేసాయి. కానీ అప్పటికే పారసైట్ కణాలు అనువు సంపాదించి స్థిరపడి వుంటే రాణా"........ చేతులు చాచి భుజా లెగరేశాడు అశ్వ త్థామ నిర్లిప్తంగా.

"ఆ చెడుకణాలని రేడియోలజీ ద్వారా కాల్చి వేస్తే?"

"ఎ....ఎస్....ఎస్...." తత్తరపడుతూ అన్నాడు అశ్వత్థామ ఆ కొత్త ఆలోచనపై మెదడుని కేంద్రీకరిస్తూ "దటీజ్ ఎ పాసిబిలిటీ జులేఖా! కాని యెప్పటికైనా ప్రమాదకరమైనదే. ఆ పద్ధతిలో చెడుకణాలతోపాటు మిగతా మంచికణాలు కూడా పాడైపోయే అవకాశం వుంది. చాల చాల జాగ్రత్త తీసుకోవాలి. ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో. ఎక్స్-రే వల్లగానీ, పారసైట్స్‌వల్లగానీ ఒకసారి పాడైపోయిన ఆరోగ్యకణాల గురించి యేమీ చెయ్యలేం. అవి యిక యెన్నటికీ పెంపొందవు."

"నో ప్రొఫెసర్! బట్ యిటీజ్ ఎ ఛాన్స్ వర్త్ టేకింగ్" అన్నదామె.

"అఫ్‌కోర్స్. కాని యీ వ్యాధికి గురైన ప్రతి వ్యక్తికీ యీ విధమైన ట్రీట్‌మెంట్ యివ్వలేం జులేఖా. అంతటి వనరులు మనకు లేవ్" తల విదిలించాడు అశ్వత్థామ నిరాశగా.

"లేదు. ఈ పద్ధతిలో అందరికీ చికిత్స యివ్వలేం"

చుట్టూ చూసింది జులేఖా. "కాని ఆ అవసరం ఏర్పడకుండా చెయ్యాల్సిన బాధ్యత మీ అందరి మీదా ఉంది. యు హేవ్ టు డిస్ట్రాయ్ ది మైక్రోప్లాస్మా!"

తన ఆఖరిమాటపై యెవరూ వ్యాఖ్యానం చెయ్యడానికి అవకాశం యివ్వకుండా చటుక్కున రాణావైపు తిరిగింది జులేఖా. "రాణా! నేను యిప్పుడు తిరిగి రీసెర్చి సెంటర్ కి వెళ్ళిపోతున్నాను. లూసీకి వెంటనే రక్తశుద్ధి చికిత్స చేద్దామనుకుంటున్నాను. అవసరమైతే రేడియోలజీ ట్రీట్ మెంట్ కూడా. ఆమె తండ్రి కండిషన్ బాగోలేని కారణంగా నీ నుండి పర్మిషన్ కావాలి యివి చెయ్యాలంటే."

"గో యెహెడ్ జులేఖా!" చెప్పాడు రాణా. "ఆమెకి యేది అవసరమనిపిస్తే, యెన్ని అవసరమనిపిస్తే అన్నీ నిరభ్యంతరంగా చెయ్యి. ఐ ట్రస్ట్ యువర్ టాలెంట్."

"థాంక్యూ" అని భుజంతట్టి పైకి లేచింది జులేఖా. "జంటిల్మెన్! నన్ను క్షమించాలి. నేను కొన్ని ప్రాణాలు బ్రతికించాలి. అందుకు చాల యేర్పాట్లు చేసుకోవాలి. ఈ సమావేశంలోని మిగతా వివరాలు తర్వాత నాకు అందేట్టు చూస్తారని ఆశిస్తాను."

చకచకా నడిచిపోతున్న జులేఖాను మెచ్చుకోలుగా చూస్తూ చిరునవ్వు నవ్వాడు అశ్వత్థామ.

హోం సెక్రెటరీ గొంతు సవరించుకున్నాడు. "మిస్టర్ అశ్వత్థామా! ఒకసారి సంతృప్తికరంగా యీ ఉన్మాదవ్యాధి నుండి కోలుకున్న మనిషికి తిరిగి మళ్ళీ సంక్రమించే అవకాశం వుందా?"

ప్రొఫెసర్ రెండు క్షణాలు ఆలోచించి బదులు

చెప్పాడు. "సాధారణంగా శరీర నిర్మాణం తనలోంచి ఒక వ్యాధిని త్రోసిపుచ్చ గలిగినపుడు పూర్తి వ్యాధి నిరోధక శక్తి అది పెంపొందించుకొంటుంది. ప్రస్తుతం రాణా కేసులోలాగానే త్వరితంగానే చెడు జీవకణాలని చంపి, శరీరంనుంచి బయటికి గెంటించడం జరిగితే నా ఉద్దేశం ప్రకారం మళ్ళీ యీ వ్యాధి అతనికి యెటాక్ అయ్యే అవకాశం లేదు. ఈ సిద్ధాంతాన్ని యింకా టెస్టు చేయవల్సి వుందనుకోండి....అయితే మీకు తెలిసే వుండాలి. శరీరానికి సెల్ఫ్ ప్రిజర్వేషన్ అనే శక్తి ఉంటుంది. శరీరం దాని రక్షణలు దాని కదే ఏర్పాటు చేసుకొంటుంది."

"ఈ వ్యాధి ఒకరికి ప్రబలినపుడు అది మరొకరికి సోకే ప్రమాదముందా? ఈజ్ దిస్ యిన్ఫెక్టివస్?" అడిగాడు సన్యాల్.

"నో. అలాంటి ప్రమాదం లేదు. పోతే సమస్య యేమిటంటే, సాధారణ స్థితిలో వున్న మైకోప్లాస్మ గురించే మనకు కావలసినంత తెలియదు. ఇక దాన్ని కొన్ని మార్పులకు గురిచేస్తే జరిగేదేమిటో బొత్తిగా తెలియదు. ఫిజియోలజీ, బయోకెమిస్ట్రి ప్రకారం మైకోప్లాస్మ, బాక్టీరియాల లక్షణాలు ఒక్కటే. కానీ మైకోప్లాస్మకు కణకవచం వుండదు. అందుచేత దానికి ఒక యిబ్బంది లేదు. తన ఆకారాన్ని మార్చుకుని ఎంత చిన్న రంధ్రంలోనైనా అది ప్రవేశిస్తుంది."

గొంతు సవరించుకుంటూ అన్నాడు సన్యాల్ "అయితే దీనికి నివారణ లేదా?"

"నో....నో....మనం తప్పక పరిష్కారం కనుక్కోవచ్చు. కాని దీనికి విరుగుడు మందు....ఐ మీన్....సెరమ్

కనుక్కోబోయే ముందు మైక్రోప్లాస్మా అసలు ఏ విధంగా మార్పులు చేయబడిందో తెలుసుకోవాలి."

"దాన్ని గురించి మీకీ పాటికి ఓ అభిప్రాయం ఉండి వుండాలి మిస్టర్ అశ్వత్థామా?"

"ఓహ్, నాకో అభిప్రాయం వుంది. కాని పరిశోధనలు చేసి నా అభిప్రాయాల్ని డెవలప్ చేసుకొనేందుకు సమయం వుందా? లేదు. కాని బ్రతికున్న వ్యాధిపీడితుల అర్గానిజం పరిశీలించి దాని కంటెంట్స్ తెల్సుకుని విరుగుడు మందు తయారుచేయొచ్చు. కాని ఈ సెరమ్‌ని భారీ యెత్తున ఉత్పత్తి చేయాలంటే చాలా కాలం పడుతుంది. అంత టైం తీసుకునే అవకాశం మనకు లేదు. కాబట్టి యీ మార్పులు చేయబడ్డ మైక్రోప్లాస్మాని పరిశుద్ధ స్థితిలో మనం శాంపిల్ తీసుకోగలిగితే అది చాల చాల ఉపయోగకరం."

"వెల్. ఆ పొగమంచులో కొంత భాగాన్ని తీసుకు రావడం అంత కష్టమేముంది?" డిఫెన్స్ అండర్ సెక్రెటరీ అడిగాడు అసహనంగా.

"నేను చెప్పింది 'పరిశుద్ధమైన దశలో వున్న మైక్రోప్లాస్మా శాంపిల్' కావాలని. ఈ పొగమంచు లేదా విషమేఘంలో కార్బన్-డై-ఆక్సైడ్, ఇంకా అనేక కల్మష వాయువులు వుంటాయి. ఈ పొగమంచుకు పసుపు రంగు రావడం, గాలిలోని వాతావరణ కాలుష్యం వల్లనే. ఈ అక్కర్లేని యెలిమెంట్స్‌ని వేరుచేసి ఆ మైక్రోప్లాస్మాని గ్రహించడానికి టైం పడుతుంది."

"డిసీజ్ లీడింగ్ అస్ టు అవర్ నెక్స్ట్ పాయింట్ జంటిల్మెన్!" అన్నాడు హోం సెక్రెటరీ. "ఈ వైరస్ వ్యాధి ప్రబలడానికి కారణాలు వివరించవల్సిందిగా లెప్టి

సెంట్ జనరల్ ప్రచండసేన్‌ని కోరుతున్నాను.”

“అది ప్రజల్ని నాశనం చేసేముందు, ఏ విధంగా తప్పించుకుని బైటపడ్డదో కూడా చెప్పాలి,” అన్నాడు సన్యాల్ వెటకారంగా.

ప్రచండసేన్ లేచి నిలబడ్డాడు, సైనికుల ముందు మాట్లాడబోయే అధికారిలా.

“సైంటిస్టు విశ్వామిత్ర అనేక సాంకేతిక మార్పులకు గురిచేసి తయారుచేసిన ఈ మైకోప్లాస్మా—గాలి చొరవని గదిలో, స్టీలుతో చేయబడి అన్నివైపులా సీలు చేయబడ్డ ఒక పరీక్షనాళికలాంటి పరికరంలో బిగించబడ్డది. విశ్వామిత్ర పొరబాటున దాని మూత పడవేశాడు, ఒక జంతువుపై పరిశోధన జరుపుతుండగా—కుందేలు అనుకుంటాను.

“ఏమైనా, విశ్వామిత్ర తన పొరపాటు గుర్తించి తిరిగి మూత బిగించి సీలుచేయబడిన ఆ గదిని వదిలిపెట్టాడు. అతను పిచ్చివాడుగా మారడానికి కొంత టైం పట్టింది. ప్రొఫెసర్ అశ్వత్థామ చెప్పినట్లుగా అప్పటికి మైకోప్లాస్మా పరిశుద్ధ దశలో వుంది. కొద్ది క్షణాలు మాత్రమే దానికి ఎక్స్‌పోజ్ అయ్యాడు విశ్వామిత్ర. బయటగాలీ, సూర్యరశ్మి సోకగానే అతని శరీరంలో చోటుచేసుకున్న మైకోప్లాస్మా తన విషప్రభావాన్ని చూపించసాగింది.

“ఉన్మాదస్థితిలో విశ్వామిత్ర కాగితాల మీద పెట్టిన తన కృషినంతా నాశనం చేసాడు. అంతేకాదు, తోటి సైంటిస్టు నొకడ్ని చంపేశాడు. తర్వాత అతను పని చేయలేని బొమ్మలా, డమ్మీలా మారాడు. అతని కళ్ళు దేనినీ చూసేవికావు. అతని చెవులు ఏ శబ్దాన్నీ వినేవి కావు. కొద్దిరోజుల తర్వాత తనను తానే పొడుచుకుని మరణించాడు.

(ఇంకా వుంది)